ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY
డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా వార్తలు
బుధవారం 9 అక్టోబరు 2024 | 7



మండపేట మండలం వేములపల్లిలో అసైన్డ్ భూములు

ఆ భూములు ఎవరి చేతుల్లో..?



'వెసులుబాటే' వరమైందా?

కొందరు పెద్దల చేతుల్లోకి 'ఫ్రీ హోల్డ్' భూములు
వైసీపీ ప్రభుత్వంలో అడ్డగోలుగా అసైన్డ్ భూముల రిజిస్ట్రేషన్లు
ఇప్పుడు వాటిపై కూటమి ప్రభుత్వ దృష్టి
విచారణ నిర్వహిస్తున్న వైనం

గత వైసీపీ ప్రభుత్వ హయాంలో అక్రమార్కులు అడ్డగోలుగా ప్రభుత్వ భూములను చేజిక్కించుకున్నారు. 20 ఏళ్లు గడిచిన ప్రభుత్వ అసైన్డ్ పట్టా భూములపై హక్కులు కల్పించనున్నట్టు ప్రభుత్వం ప్రకటించడమే తరువాయి.. అక్రమ మార్గంలో అసైన్డ్ భూముల రిజిస్ట్రేషన్లు జరిగిపోయాయి. పేదల జీవనోపాధికి పంపిణీ చేసిన ప్రభుత్వ భూములు కొందరు పెద్దల చేతుల్లోకి వెళ్లిపోయాయనే ఆరోపణలు తీవ్రంగా ఉన్నాయి. అయితే అవి ఎవరి ఆధీనంలో ఉన్నాయి? అమ్మకాలు జరిగితే ఎవరు కొనుగోలు చేశారు అనేదే ఇప్పుడు తేలాల్సి ఉంది. దీంతో ఆ కోణంలోనే విచారణ సాగుతోంది.

● (మండపేట)

ఫ్రీ హోల్డ్ పేరుతో..

ఆర్అండ్‌బీ, పోరంబోకు స్థలాలు, దేవదాయ శాఖ స్థలాలను కొంతమంది కొట్టేశారు. జిల్లాలో 22 మండలాల్లో 17 వేల ఎకరాలు ప్రభుత్వ భూములు ఉండగా అందులో 232 ఎకరాలను నిషిద్ధ జాబితా నుంచి తొలగిస్తూ అప్పటి జిల్లా కలెక్టర్ ఫ్రీహోల్డ్ చేశారు. దీంతో రిజిస్ట్రేషన్ శాఖ ద్వారా 30 ఎకరాలు ఇతరుల పేరున రిజిస్ట్రేషన్ జరిగిందని తేలింది. ఇదే అంశంపై అధికారులు ఆరా తీస్తున్నారు. భూములు అసలు ఎవరి పేరున ఇచ్చారు. ప్రస్తుతం రిజిస్ట్రేషన్ ఎవరి పేరున ఉంది అనే వివరాలను సేకరిస్తున్నారు. ఇప్పటికే ఫ్రీ హోల్డ్ భూములు రిజిస్ట్రేషన్‌పై జిల్లాలో మూడు రెవెన్యూ డివిజన్లలో మూడు బృందాలను ఏర్పాటు చేసి ఆరా తీస్తున్నారని అధికారులు చెప్పారు.



మండపేట తహసీల్దార్ కార్యాలయంలో అధికారుల విచారణ

భూములకు రెక్కలొచ్చాయి..

మండపేట మండలంలో ద్వారపూడి, వేములపల్లిలో ఫ్రీ హోల్డ్ భూములకు రెక్కలొచ్చాయి. ఇక్కడ 238 ఫైల్స్‌కు సంబంధించి పరిశీలన జరుగుతోంది. జిల్లాలో అత్యధికంగా మండపేట మండలం ద్వారపూడి పంచాయతీ పరిధిలో గల వేములపల్లిలో 230 ఎకరాలు, జెడ్.మేడపాడులో రెండు, ద్వారపూడిలో 1 ఎకరం కలిపి మొత్తం 238 ఎకరాలు ఫ్రీ హోల్డ్‌లో భారీగా మార్పులు చేర్పులు జరిగాయి. వాటిపై జిల్లా అధికార యంత్రాంగం ప్రత్యేక దృష్టి సారించింది. ఇప్పటికే మండపేట సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో 28.27 ఎకరాలు రిజిస్ట్రేషన్ పలువురి పేరున జరిగిందని అధికారులు గుర్తించారు.. గత పది రోజుల నుంచి జిల్లాలో భూములపై ప్రత్యేకంగా ప్రభుత్వం నియమించిన బృందాలు భూములు వాటికి సంబంధించిన రికార్డులను పరిశీలిస్తున్నారు. మొత్తం మీద వైసీపీ ప్రభుత్వం జారీ చేసిన ఫ్రీ హోల్డ్ జీవో నేపథ్యంలో ఎంతమేర అసైన్డ్ భూములు చేతులు మారాయి ఇందులో ఎవరిపాత్ర ఎంత అనే దానిపై ప్రభుత్వం ఆరా తీస్తుంది. గతంలో ఇక్కడ పనిచేసిన సమయంలో భూముల రికార్డులను ఆన్‌లైన్‌లో మార్పులు చేసిన అధికారులపై వేటు తప్పకపోవచ్చని తెలుస్తుంది. జిల్లాలోనే అధికంగా మండపేట మండలంలో జరిగిన భూమాయలో ఎవరిపాత్ర ఏమిటి, ఎవరిపై వేటు పడుతుందనే దానిపై రెవెన్యూ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఇదే విషయంపై మండపేట మండల తహసీల్దార్ తేజేశ్వరరావును వివరణ కోరగా వేములపల్లి, ద్వారపూడి, జెడ్.మేడపాడులలో ప్రభుత్వ అసైన్డ్ భూములు, ఫ్రీ హోల్డ్ చేసిన సమయంలో జరిగిన వ్యవహారంపై ప్రభుత్వం ఆదేశాల మేరకు విచారణ జరుగుతుందని చెప్పారు.

రూ.25 లక్షలతో

ముమ్మిడివరం, అక్టోబరు 8: ముమ్మిడివరం మండలం ఠాణేలంక పంచాయతీ పరిధిలోని గోదశివారిపాలెంలోని శ్రీవిజయ దుర్గమ్మవారు మంగళవారం మహాలక్ష్మి అమ్మవారిగా భక్తులకు దర్శనమిచ్చారు. రూ.25 లక్షల కరెన్సీ నోట్లతో అమ్మవారిని విశేషంగా అలంకరించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు.



గోదశివారిపాలెంలో..

మహాలక్ష్మి అలంకారం

రూ.3,33,33,333

8లో



అమలాపురంలో రూ.3 కోట్లతో అలంకరణ

ఉపాధి హామీ మెటీరియల్ కాంపోనెంట్ ద్వారా ఈ నెల 14 నుంచి 20వ తేదీ వరకు పల్లె పండుగ వారోత్సవాలను జిల్లాలోని అన్ని పంచాయతీల్లో నిర్వహించనున్నట్లు కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ తెలిపారు. ప్రజాప్రతినిధులను సమన్వయం చేసుకుని ఆయా పనులకు భూమి పూజా కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ఉప ముఖ్యమంత్రి కె.పవన్‌కల్యాణ్, పంచాయతీరాజ్ ముఖ్య కార్యదర్శి శశిభూషణ్‌కుమార్ మంగళవారం అమరావతి నుంచి పల్లెపండుగ వారోత్సవాల నిర్వహణపై జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్సు ద్వారా మాట్లాడారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ మహేష్‌కుమార్

14 నుంచి పల్లె పండుగ

ఉపాధి హామీలో 953 పనులకు రూ.50.21 కోట్లు మంజూరు ● కలెక్టర్ మహేష్‌కుమార్

అమలాపురం, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): అధికారులతో సమీక్ష నిర్వహించిన కలెక్టర్ మహేష్‌కుమార్ పలు అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆగస్టు 23న జిల్లాలో ఏకకాలంలో గ్రామసభలు నిర్వహించి తీర్మానించిన పనులకు పరిపాలన, సాంకేతిక ఆమోదాలు తెలుపుతూ వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేశామన్నారు. జిల్లా వ్యాప్తంగా మెటీరియల్ కాంపోనెంట్ కింద చేపట్టే పనులకు రూ.50.21 కోట్లు మంజూరు అయ్యాయని, వీటితో 953 పనులు చేపట్టనున్నట్లు చెప్పారు. పల్లె పండుగ వారోత్సవాల్లో భాగంగా పనులను ప్రారంభించి సంక్రాంతి నాటికి పూర్తిచేసి ఆయా వసతులను ప్రజలకు అందుబాటులోకి తేవాలన్నదే ప్రభుత్వ లక్ష్యమన్నారు. అత్యంత నాణ్యతా ప్రమాణాలతో పనులు పూర్తి చేయాలన్నారు. లైన్ డిపార్టుమెంట్ అధికారులు సమన్వయంతో పనులు నిర్వహించాలన్నారు. ప్రజలకు అర్థమయ్యే విధంగా 2024-25 సిటిజన్ బోర్డులను ఏర్పాటు చేయాలన్నారు. మెటీరియల్ కాంపోనెంట్ కింద సీసీ రోడ్లు, బీటీ రోడ్లు, సీసీ డ్రైన్లు, ఉద్యాన మొక్కల పెంపకం, గోకులాలు వంటి వివిధ పనులను చేపట్టనున్నట్లు చెప్పారు. జిల్లాకు సంబంధించి ఇప్పటి వరకు 404 పనులను వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేశామన్నారు. 235 పనులకు పరిపాలనా సాంకేతిక ఆమోదాలు పొందాయన్నారు. జిల్లాలో సిమెంట్ సరఫరాలో ఇబ్బందులు ఉన్నాయని, వాటిని అధిగమించే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో డ్వామా పీడీ ఎస్.మధుసూదన్, డీపీవో శాంతి లక్ష్మి, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ సీహెచ్ఎన్వీ కృష్ణారెడ్డి, పంచాయతీరాజ్ ఎస్ఈ పి.రామకృష్ణారెడ్డి సమీక్షలో పాల్గొన్నారు.

గర్భస్థ పిండ ఆరోగ్యానికి సంబంధించిన పరీక్షలను లింగ నిర్ధారణకు దుర్వినియోగం కాకుండా అల్ట్రా సౌండ్ స్కానింగ్ సెంటర్లపై పటిష్ట నిఘా ఏర్పాటు చేయాలని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ కమిటీ సభ్యులకు సూచించారు. డెకాయ్ ఆపరేషన్లు నిర్వహించాలన్నారు. జిల్లాస్థాయి కమిటీ సమావేశం మంగళవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ మహేష్‌కుమార్ అధ్యక్షతన నిర్వహించారు. లింగ నిర్ధారణ పరీక్షలు చేయడం చట్టరీత్యా నేరమని ప్రజలకు తెలియపరచాల

స్కానింగ్ సెంటర్లపై నిఘా..

న్నారు. అబార్షన్ కోసం డాక్టర్లు విధిగా అనుమతులు పొందాల్సిందేనన్నారు. అబార్షన్‌కు సంబంధించిన ఔషధాల వినియోగంలో విధిగా డాక్టర్ల ప్రిస్క్రిప్షన్ ఉండాలన్నారు. లింగ నిర్ధారణ పరీక్షల్లో గర్భస్థ పిండ లింగ నిర్ధారణను వెల్లడించే వ్యక్తులను కఠినంగా శిక్షించాలన్నారు. సమావేశంలో డీసీహెచ్ఎస్ డాక్టర్ కార్తీక్‌రెడ్డి, డీఎంహెచ్‌వో డాక్టర్ ఎం.దుర్గారావుదొర, అదనపు డీఎంహెచ్‌వో డాక్టర్ సీహెచ్‌వీ భరతలక్ష్మి, డీఐవో సత్యనారాయణ, డీఐపీఆర్వో కె.లక్ష్మీనారాయణ, అదనపు ఎస్పీ ప్రసాద్, డాక్టర్ శర్మ తదితరులు పాల్గొన్నారు.



జలమయమైన రోడ్డు

అమలాపురంలో కుండపోత వాన

చల్లబడిన వాతావరణం

రోడ్లన్నీ జలమయం

జోరువాన..

● అమలాపురం టౌన్



అమలాపురంలో జోరువాన కురుస్తున్న దృశ్యం

వేసవిని తలపించేలా ఎండలు మండిపోతున్న ఈ తరుణంలో భారీ వర్షం ఊరటనిచ్చింది. మంగళవారం ఉదయం 11 గంటల సమయానికి ఆకాశాన్ని మేఘాలు ఒక్కసారిగా ముంచెత్తాయి. కుండపోతగా వాన కురిసింది. రోడ్లన్నీ జలమయమయ్యాయి. ప్రధానంగా అమలాపురం నుంచి ఈదరపల్లి వెళ్లే ఏజీ రోడ్డు పూర్తిగా నీట మునగడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

అయోధ్య బాలరాముడి విల్లు



అమలాపురం టౌన్, అక్టోబరు 8: అయోధ్య రామమందిరం రెండో అంతస్తులో బాలరామునికి అలంకరించనున్న విల్లును దేవి శరన్నవరాత్రుల్లో భాగంగా మంగళవారం అమలాపురం శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి ఆర్యవైశ్య సంఘం భవనంలో భక్తుల సందర్శన కోసం ఉంచారు. 13 కిలోల వెండి, కిలో బంగారంతో చేసిన విల్లు భక్తులను ఎంతగానో ఆకట్టుకుంది. హైదరాబాద్‌కు చెందిన మద్దూరి వెంకటశ్రీనివాసరావు-పద్మజ దంపతులు బాలరాముని విల్లును అమలాపురం తీసుకువచ్చారు. అయోధ్య భాగ్యనగర సీతారామా సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ విల్లును బాలరామునికి అందజేయనున్నట్టు తెలిపారు. అధిక సంఖ్యలో భక్తులు విల్లును దర్శించుకుని పూజలు నిర్వహించారు.

16 నుంచి నీటి సంఘాల ఎన్నికల ప్రక్రియ

అమలాపురం, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): పూర్వపు నీటి వినియోగదారుల సంఘాల పునరుద్ధరణకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ తెలిపారు. రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు అమరావతి నుంచి మంగళవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్సులో కలెక్టర్ పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ నెల 16 నుంచి నవంబరు 24వ తేదీ వరకు 40 రోజుల కాల వ్యవధిలో నీటి వినయోగదారుల సంఘాల ఎన్నికల ప్రక్రియ పూర్తి చేయాలని ఆదేశించారన్నారు. రైతులకు మేలు చేకూర్చే విధంగా సాగునీటి సంఘాల వ్యవస్థను పునరుజ్జీవింప చేయడానికి పటిష్ట చర్యలు చేపట్టామన్నారు. గతంలో రూపొందించిన జాబితాలను అవసరమైతే పరిశీలన చేసి నూతన జాబితాలను రూపొందించాలన్నారు. ప్రాదేశిక నియోజకవర్గాల వారీగా కౌలు రైతులు, రైతులను నమోదు చేయాల్సి ఉందన్నారు. ప్రజాస్వామ్య బద్ధంగా ఎన్నికల నిర్వహణ సజావుగా నిర్వహించాలని సూచించారు. జిల్లాలోని సెంట్రల్ డెల్టాలో తొమ్మిది డిస్ట్రిబ్యూటరీ కమిటీలు, 56 నీటి వినియోగదారుల సంఘాలు ఉన్నాయని, తూర్పు డెల్టాలో ఎనిమిది డిస్ట్రిబ్యూటరీ సంఘాలు, 32 నీటి వినియోగదారుల సంఘాలు ఉన్నాయని కలెక్టర్ తెలిపారు. జలవనరుల శాఖ ఇంజనీర్లు బి.శ్రీనివాసరావు, ఎ.శ్రీనివాసరావు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.



కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ మహేష్

నిత్యావసర ధరల నియంత్రణకు చర్యలు

ధరల నియంత్రణ కమిటీ సమావేశంలో జేసీ నిషాంతి

అమలాపురం టౌన్, అక్టోబరు 8: నిత్యావసర సరుకుల ధరల నియంత్రణకు హోల్‌సేల్ డీలర్లు ప్రభుత్వానికి సహకరించి తగ్గింపు రేట్లకే విక్రయించాలని జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి కోరారు. ధరల నియంత్రణ కమిటీ సమావేశం మంగళవారం కలెక్టరేట్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నిత్యావసరాల ధరలు బహిరంగ మార్కెట్‌లో ఎక్కువగా ఉన్నందున పౌర సరఫరాలశాఖ అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. హోల్‌సేల్ డీలర్లతో సమావేశం ఏర్పాటు చేసి వారికి వచ్చే లాభాలను కొద్ది మేర తగ్గించుకుని ప్రజా శ్రేయస్సు కోసం రేట్లు తగ్గించేలా చర్యలు తీసుకోవాలన్నారు. మార్కెట్‌లో ఎక్కువ ధరలకు నిత్యావసరాలు విక్రయిస్తుంటే వినియోగదారులు కమాండ్ కంట్రోల్ రూము నంబరు 18004252532 టోల్‌ఫ్రీ నంబరుకు ఫోన్‌చేసి ఫిర్యాదు చేయవచ్చునన్నారు. బియ్యం, కందిపప్పు, మినపప్పు, ఆయిల్స్, టమాటాలు, ఉల్లిపాయలు, బంగాళదుంపల ధరలను తగ్గించి ప్రభుత్వానికి సహకరించాలని కోరారు. లేనిపక్షంలో ధరల నియంత్రణ, నిత్యావసర వస్తువుల చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో డీఎస్‌వో ఉదయభాస్కర్, మార్కెటింగ్ శాఖ ఏడీ కె.విశాలాక్షి, పౌరసరఫరాల శాఖ అధికారులు, హోల్‌సేల్ డీలర్లు, వ్యాపారస్తులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జేసీ నిషాంతి

ధనలక్ష్మీ నమోస్తుతే

దేవీ శరన్నవరాత్రులు వైభవంగా జరుగుతున్నాయి. ఆరో రోజైన మంగళవారం అమ్మవారు మహాలక్ష్మీ దేవిగా, ధనలక్ష్మిగా దర్శనమిచ్చారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో పలుచోట్ల అమ్మవారిని నోట్ల దండలతో అలంకరించారు. అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకుని తరించారు.



అరట్లకట్టలో రూ.9 లక్షలతో

కాకినాడ జిల్లా కరప మండలం అరట్లకట్టలోని భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి ఆలయంలో అమ్మవారు మహాలక్ష్మి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అర్చకులు కొండేటి సత్యనారాయణమూర్తి, శివశర్మ అమ్మవారికి విశేష పూజలు చేశారు. గ్రామస్తులు, భక్తుల సహకారంతో సమకూరిన రూ.9లక్షలు విలువైన కొత్త కరెన్సీతో అమ్మవారిని, ఆలయ ప్రాంగణాన్ని అందంగా అలంకరించారు. - కరప



గోకవరంలో రూ.30లక్షలతో

తూర్పు గోదావరి జిల్లా గోకవరం దేవీచౌక్ సెంటర్లో దుర్గాదేవి మంగళవారం ధనలక్ష్మీదేవిగా దర్శనమిచ్చారు. అమ్మవారిని సుమారు రూ.30లక్షల కరెన్సీతో అలంకరించారు. - గోకవరం



కడియపులంకలో రూ.3లక్షలతో

తూర్పు గోదావరి జిల్లా కడియం మండలం కడియపులంక హరిహర మహాక్షేత్రంలో అపర్ణా దేవి మహాలక్ష్మీదేవి రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారిని రూ.3లక్షల కరెన్సీతో అలంకరించారు. ఆలయ ధర్మకర్తల మండలి ఛైర్మన్, తెలుగు రైతు రాష్ట్ర ఉపాధ్యక్షుడు మార్గాని సత్యనారాయణ, మాజీ ఎంపీపీ మర్గాని లక్ష్మి దంపతులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. - కడియం



3,33,33,333

అమలాపురంలో శ్రీవాసవి కన్యకాపరమేశ్వరిదేవికి శ్రీమహాలక్ష్మీదేవిగా అలంకరణ

అమలాపురం టౌన్, అక్టోబరు 8: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌కోనసీమ జిల్లా అమలాపురం మెయిన్‌రోడ్డులోని శ్రీవాసవికన్యకాపరమేశ్వరిదేవికి మహాలక్ష్మీదేవిగా విశేష అలంకారం జరిపించారు. శ్రీవాసవికన్యకాపరమేశ్వరి వైశ్య సంఘం, ఉత్సవ కమిటీ అధ్యక్షుడు నంబూరి సత్యనారాయణమూర్తి, కార్యదర్శి నంబూరి నరేష్, కోశాధికారి కొమ్మూరి వెంకటాచలప్రసాద్, ఉత్సవ కమిటీ ఛైర్మన్ అప్పన వీరన్న, కో-ఛైర్మన్లు పచ్చిగోళ్ల సోమరాజు, నూలు శ్రీనివాస్ ఆధ్వర్యంలో అమ్మవారి గర్భాలయాన్ని, ఆలయ ప్రాంగణాన్ని రూ.3,33,33,333 నోట్ల దండలతో ప్రత్యేకంగా అలంకరించారు. కరెన్సీ మహాలక్ష్మిని జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి, ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబు, అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు.

లలితాత్రిపురసుందరీ దేవి ఆలంకరణలో
దేవీచౌక్ అమ్మవారు



రాజమహేంద్రవరం సిటీ, అక్టోబరు 8: తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరం దేవీచౌక్‌లో శ్రీబాలాత్రిపురసుందరీ దేవి శరన్నవరాత్రి ఉత్సవాలను ఉత్సవ కమిటీ వైభవంగా నిర్వహిస్తోంది. మంగళవారం ఉదయం అమ్మవారికి కుంకుమ పూజలు చేసి మంగళ హారతులు ఇచ్చారు. భవానీ మాలధారులు, అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. అమ్మవారు శ్రీలలితాత్రిపురసుందరీదేవి అలంకరణలో భక్తులను అనుగ్రహించారు. పలువురు నగర ప్రముఖులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. రాత్రి మోహన్ ఆర్కెస్ట్రా సంగీత విభావరి అలరించింది.



← దేవీచౌక్‌లో అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు



దేవస్థానం గ్యారేజీలో బస్సులు

కొత్త బస్సులు వచ్చేశాయి

అన్నవరం అక్టోబరు 8: సుదూర ప్రాంతాల నుంచి రైలు, రోడ్డు మార్గాల్లో అన్నవరం చేరుకుని అక్కడి నుంచి కొండపైకి వెళ్లే భక్తుల సౌకర్యార్థం దేవస్థానం రెండు నూతన బస్సులు కొనుగోలు చేసింది. వీటిని మంగళవారం అన్నవరం దేవస్థానం గ్యారేజీకి చేర్చారు. రెండు బస్సులకు సుమారు రూ.85 లక్షలు వ్యయం అయినట్టు అధికారులు వెల్లడించారు. ఈ బస్సులకు ముందు భాగంలో శంఖు, చక్ర, నామాలు... పై భాగంలో సత్యదేవుడి ఆలయ గోపురం నమూనా ఏర్పాటుచేశారు. వీటిని దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డితో ప్రారంభింపచేయాలని అధికారులు ఆలోచన చేస్తున్నారు. దేవస్థానంలో ప్రస్తుతం ఏడు బస్సులున్నాయి. వీటిలో రెండింటిని సత్యగిరి నుంచి రత్నగిరికి ఉచిత సర్వీసుగా తిప్పుతున్నారు. మిగిలిన ఐదింటిలో రెండు తరచూ మరమ్మతులకు గురవుతుండడంతో వాటి స్థానంలో నూతన బస్సులను అందుబాటులోకి తీసుకు రానున్నారు. పాత బస్సుల పర్మిట్‌లను వీటికి మార్చే పనిలో దేవస్థానం రవాణా విభాగం అధికారులు వున్నారు.

విద్యార్థుల ఆలోచనల అభివృద్ధికి... కలల సాకారానికి
జేఎన్టీయూకేలో స్టార్టప్ ఫెస్ట్

జేఎన్టీయూకే, అక్టోబరు 8: సుబు కోట ఫౌండేషన్ సహకారంతో కాకినాడ జేఎన్టీయూ లో నిర్వహిస్తున్న ఇన్నోవేషన్, ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ అభివృద్ధి కార్యక్రమాల్లో భాగంగా అలూమ్ని ఆడిటోరియంలో మంగళవారం స్టార్టప్ ఫెస్ట్-2024 నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఉప కులపతి కేవీఎస్‌జీ మురళీకృష్ణ, విశిష్ట అతిథులుగా ఐక్యూఏసీ డైరెక్టర్ ప్రొఫెసర్ ఎంహెచ్‌ఎం కృష్ణప్రసాద్, యూసీఈకే ప్రిన్సిపాల్ ఎస్.మోహన్‌రావు పాల్గొన్నారు. క్రాస్ బోర్డర్స్ ఫౌండర్ సుబ్బరాజు అధ్యక్షత వహించగా ప్రతినిధి సిద్దు, వర్సిటీ అధ్యాపకుడు రఘురాం సమన్వయకర్తలుగా వ్యవహరించారు. వీసీ మురళీకృష్ణ మాట్లాడుతూ సుబుకోట ఫౌండేషన్ ద్వారా యూనివర్శిటీలో ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ బూట్ క్యాంప్స్, పరిశ్రమల సందర్శన, ఎకో సిస్టమ్ సందర్శన, ఎంపిక చేసిన విద్యార్థుల ఆలోచనలను ప్రయోగాత్మకంగా అభివృద్ధి చేయడానికి ఆర్థిక సహకారం అందించి వారి కలలను సాకారం చేస్తామన్నారు. ఏడాది కాలంగా నిర్వహిస్తున్న కార్యక్రమాల ద్వారా 150 స్టార్టప్‌లలో ఏడు వినూత్న ఆలోచనలను ఎంపిక చేసి విద్యార్థులను ప్రోత్సహించడంతో పాటు వాటిని అభివృద్ధి చేసేందుకు సుబుకోట ఫౌండేషన్ ఆధ్వర్యంలో మెంటార్లను కూడా నియమించామన్నారు. జేఎన్టీయూకే, అనుబంధ కళాశాలల విద్యార్థులు ఏడు స్టార్టప్‌లను పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా తమ ఆలోచనలను వివరించారు. కనెక్టింగ్ బ్రెయిన్ విత్ టెక్, రాక్స్ ఎడ్యు ఆల్ట్‌టెక్, ఈఎల్ఆర్ఎస్, ప్రోగ్రెస్ పాయినీర్స్, ఎనేబుల్డ్ బయోనిక్స్, ద ట్రయిల్ బ్లేజర్స్ గురించి వివరించారు. ఎనేబుల్డ్ బయోనిక్స్ (ప్రథమ), ప్రోగ్రెస్ పాయినీర్స్ (ద్వితీయ), కనెక్టింగ్ బ్రెయిన్ విత్ టెక్ (తృతీయ) స్థానాల్లో నిలిచాయి. సుబుకోట ఫౌండేషన్ ద్వారా వారికి రూ.2.5 లక్షలు, రూ.1.5 లక్షలు, రూ.లక్ష నగదును బహుమతులుగా అందజేశారు. ఐటీ లీడర్, పరిశోధకులు పి.సురేష్, రావా ఏఐ కో-ఫౌండర్ కిరణ్‌బాబు, కృష్ణప్రసాద్ న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు. మెంటార్లుగా శాతక్, పల్లవ్, హిమజ ప్రాతినిధ్యం వహించగా డైరెక్టర్లు, వైస్ ప్రిన్సిపాల్స్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌లో విజేతలకు నగదు బహుమతులు అందజేస్తున్న జేఎన్టీయూకే ఉప కులపతి మురళీకృష్ణ, అతిథులు



సారె తీసుకెళ్తున్న ఈవో రామచంద్రమోహన్, ఛైర్మన్ రోహిత్

విజయవాడ దుర్గమ్మకు సారె, చీర సమర్పణ

అన్నవరం, అక్టోబరు 8: శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా విజయవాడ కనకదుర్గమ్మకు అన్నవరం దేవస్థానం తరపున సారె, చీర, పట్టువస్త్రాలు, మధుర ఫలాలను ఈవో రామచంద్రమోహన్, ఛైర్మన్ రోహిత్ మంగళవారం అందజేశారు. కనకదుర్గకు సోదరునిగా భావించే సత్యదేవుడి ఆలయం నుంచి పుట్టింటి సారెను అందజేయడం ఆనవాయితీగా వస్తోంది. కార్యక్రమంలో ఏఈవో కొండలరావు, ప్రధానార్చకుడు కోట సుబ్రహ్మణ్యం, అర్చకుడు ఇంద్రగంటి సుధీర్ తదితరులు పాల్గొన్నారు.



బాలికలకు కౌన్సిలింగ్ ఇస్తున్న మహిళా రక్షక్ పోలీసులు

ఇన్‌స్టా ఫ్రెండ్స్... ఇంటి నుంచి పరార్

పసిగట్టిన 'మహిళా రక్షక్' పోలీసులు... తల్లిదండ్రులకు అప్పగింత

రాజమహేంద్రవరం, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): నలుగురు బాలికలు ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయమయ్యారు... స్నేహం పెరిగింది... ఏమైందో ఏమో గానీ పెద్దవాళ్లకు చెప్పకుండా ఇళ్ల నుంచి వచ్చేశారు. వారి తీరును గమనించిన మహిళా రక్షక్ పోలీసులు పసిగట్టి ఇళ్లకు పంపించారు. తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో మహిళా రక్షక్ టీమ్ సోమవారం రాత్రి పెట్రోలింగ్ చేస్తోంది. ఆర్టీసీ కాంప్లెక్స్‌లో నలుగురు బాలికలు అనుమానాస్పదంగా సంచరిస్తూ కనిపించారు. మెల్లగా వారిని సమీపించి ఆరా తీయగా తాము ఇన్‌స్టాగ్రామ్‌లో స్నేహితులమని చెప్పారు. ఇంట్లో చెప్పకుండా వచ్చేశామని వెల్లడించారు. దీంతో పోలీసులు తల్లిదండ్రులను పిలిపించి బాలికలకు కౌన్సిలింగ్ ఇచ్చి వారితో పంపించారు. మహిళా రక్షక్ ప్రారంభించిన అతి కొద్ది రోజుల్లోనే గుడ్ వర్క్ చేయడంతో ఎస్పీ నరసింహ కిషోర్ ప్రత్యేకంగా అభినందించారు. కాగా ఆ నలుగురు బాలికలతో పాటు ఉన్న మహిళ వారిలో ఒకరి తల్లిగా పోలీసులు చెప్తున్నారు. అసలు ఆ మహిళ ఎవరు? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. దీనిపై ఎస్పీ దృష్టి సారించాల్సి ఉంది.

హత్య కేసులో నిందితుడికి
పదేళ్ల జైలు శిక్ష

తీర్పు ఇచ్చిన కాకినాడ మూడో అదనపు జిల్లా సెషన్స్ కోర్టు న్యాయమూర్తి కమలాదేవి

సర్పవరం జంక్షన్, అక్టోబరు 8: కుట్టుమిషన్ చోరీపై గొడవపడి విచక్షణారహితంగా దాడిచేసి హత్యకు పాల్పడ్డ వ్యక్తికి పదేళ్ల జైలు శిక్ష విధించారు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం సుక్మా జిల్లా కొర్ర గ్రామానికి చెందిన మడ్వి జీవనోపాధి కోసం కాకినాడ రూరల్ కొత్తూరులో నివాసం ఉండేవాడు. కుట్టుమిషన్ హెడ్ దొంగతనం విషయమై సింహాద్రి స్వరూప తనతో సహజీవనం చేస్తున్న గుత్తుల శ్రీనుకి చెప్పింది. ఈ విషయమై మడ్వి శ్రీను మధ్య వాగ్వాదం జరిగింది. తర్వాత ఇదే విషయమై జరిగిన గొడవను దృష్టిలో పెట్టుకుని 2023 అక్టోబరు 19న శ్రీనుని మడ్వి కర్రతో తలపై విచక్షణారహితంగా కొట్టగా అక్కడికక్కడే మృతి చెందాడు. స్వరూప సింహాద్రి ఫిర్యాదు మేరకు అప్పటి తిమ్మాపురం ఎస్ఐ కె.షరీఫ్ కేసు నమోదు చేసి సీఐ కె.శ్రీనివాస్ ఆధ్వర్యంలో దర్యాప్తు చేసి తగిన సాక్ష్యాధారాలతో నిందితుడిపై కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. సాక్షులను విచారించిన తర్వాత నేరం రుజువు కావడంతో కోసి మడ్వికి పదేళ్ల కఠిన కారాగార శిక్ష విధిస్తూ కాకినాడ మూడో అదనపు జిల్లా సెషన్స్ కోర్టు న్యాయమూర్తి కమలాదేవి తీర్పు ఇచ్చినట్టు తిమ్మాపురం ఎస్ఐ ఎంవీవీ రవీంద్రబాబు తెలిపారు. సకాలంలో చార్జిషీట్ దాఖలు చేసి తగిన సాక్ష్యాలతో నిందితుడికి శిక్ష పడేలా కృషి చేసిన డీఎస్పీ రఘువీర్‌విష్ణు, సీఐ డీఎస్ చైతన్యకృష్ణ, ఎస్ఐ ఎంవీవీ రవీంద్రబాబులను కాకినాడ జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ప్రత్యేకంగా అభినందించారు.

వ్యక్తి మృతి కేసులో ముగ్గురి అరెస్టు

వై.రామవరం, అక్టోబరు 8: అడవి జంతువులకు విద్యుత్ తీగలు అక్రమంగా అమర్చిన సంఘటనలో ఓ వ్యక్తి మృతి చెందిన కేసుకు సంబంధించి దేవరమడుగులకు చెందిన ముగ్గురిని అరెస్టు చేసి మంగళవారం కోర్టుకు తరలించినట్టు అడ్డతీగల సీఐ నరసింహమూర్తి, వై.రామవరం ఎస్ఐ రామకృష్ణ తెలిపారు. దేవరమడుగలకు చెందిన లోతా సూరిరెడ్డి (33) గత నెల 5వ తేదీన ఇంటి నుంచి వెళ్లిపోవడంతో తొలుత మిస్సింగ్ కేసు నమోదు చేశారు. పిట్టల వేటకు వెళ్లిన సూరిరెడ్డి అడవి జంతువుల కోసం అమర్చిన విద్యుత్ తీగలు తగిలి మృతి చెందినట్టు పోలీసుల దర్యాప్తులో తేలింది. ఈ విషయాన్ని గోప్యంగా ఉంచేందుకు పొత్తూరు పండయ్య, పొత్తురు కృష్ణారెడ్డి, కిమ్ముడు బాలురెడ్డి మృతదేహాన్ని పూడ్చిపెట్టి పరారయ్యారు. సీఐ నరసింహమూర్తి దర్యాప్తు చేసి ముగ్గురిని అరెస్టు చేసి కోర్టుకు తరలించారు.

చెడు వ్యసనాలకు బానిసలై చోరీల బాట

ఇద్దరు నిందితుల అరెస్టు ▸ రూ.8 లక్షలు విలువైన బంగారు, వెండి సామగ్రి స్వాధీనం

రాజానగరం, అక్టోబరు 8: చెడు వ్యసనాలకు బానిసలై చోరీలకు పాల్పడుతున్న ఇద్దరిని రాజానగరం పోలీసులు అరెస్టు చేశారు. వేర్వేరు దొంగతనం కేసుల్లో అపహరణకు గురైన బంగారు ఆభరణాలతో పాటు వెండి సామగ్రిని నిందితుల నుంచి పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. తూర్పు గోదావరి జిల్లా రాజానగరం పోలీస్ స్టేషన్లో మంగళవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో దీనికి సంబంధించిన వివరాలను రాజానగరం సీఐ ఎస్.ప్రసన్న వీరయ్యగౌడ్ వెల్లడించారు. రాజమహేంద్రవరం రూరల్ కొంతమూరు రాజరాజేశ్వరి నగర్‌కు చెందిన బచ్చల గంగ గత నెల 21న కుటుంబ సభ్యులతో కలిసి కాకినాడ జిల్లా శంఖవరం వెళ్లింది. 24వ తేదీన గుర్తు తెలియని వ్యక్తులు ఇంటి తలుపులు పగులగొట్టి చోరీకి పాల్పడ్డారు. తలుపులు తెరిచి ఉండడాన్ని గమనించిన స్థానికులు యజమాని గంగకు ఫోనులో సమాచారం అందించారు. దీంతో ఆమె హుటాహుటిన వచ్చి చూసేసరికి ఇంట్లో భద్రపర్చిన బంగారం, వెండి వస్తువులు అపహరణకు గురైనట్టు గుర్తించి రాజానగరం పోలీసులకు ఫిర్యాదు చేసింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పోలీసులకు లభించిన ఆధారాల ప్రకారం రాజమహేంద్రవరం రూరల్ వెంకటనగరం గ్రామానికి చెందిన బండి ధర్మరాజు, కొంతమూరు భవానీపురానికి చెందిన వానపల్లి గౌరీశంకర్ అలియాస్ గౌరీష్ అలియాస్ పూలోడులను అనుమానితులుగా గుర్తించారు. వారిని పోలీసులు తమదైన శైలిలో ఎక్కడెక్కడ దొంగతనాలకు పాల్పడ్డారో చిట్టాను వివరించారు. గతంలో రాజానగరం, బొమ్మూరు, కోరుకొండ, గోకవరం పోలీస్ స్టేషన్ల పరిధిలో బంగారు ఆభరణాలు, వెండి వస్తు సామగ్రిని అపహరించిన నేరాలను కూడా అంగీకరించారు. నిందితుల నుంచి 22.41 గ్రాముల బంగారు ఆభరణాలు, సుమారు 2 కిలోల వెండి వస్తువులతో పాటు ఎల్ఈడీ టీవీ, రూ.20 వేలు నగదు, రెండు మోటారు సైకిళ్లు, కారును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కేసును సత్వరం ఛేదించి, నిందితులను అరెస్టు చేసిన రాజానగరం సీఐ ప్రసన్న వీరయ్య గౌడ్, ఎస్ఐ మనోహర్, కానిస్టేబుళ్లను తూర్పు గోదావరి జిల్లా ఎస్పీ నరసింహ కిషోర్ అభినందించారు.



నిందితులను, స్వాధీనం చేసుకున్న వస్తువులను చూపిస్తున్న సీఐ ప్రసన్న వీరయ్య గౌడ్

'నన్నయ'లో వచ్చే నెల 7, 8 తేదీల్లో 'ఆంధ్రప్రదేశ్ సాంస్కృతిక వైభవం'పై సదస్సు

దివాన్‌చెరువు, అక్టోబరు 8: ఆది కవి నన్నయ విశ్వవిద్యాలయంలో నవంబరు 7, 8 తేదీల్లో 'ఆంధ్రప్రదేశ్ సాంస్కృతిక వైభవం'పై సదస్సు నిర్వహిస్తున్నామని ఉప కులపతి ఆచార్య వై.శ్రీనివాసరావు తెలిపారు. మంగళవారం ఆయన సంబంధిత బ్రోచర్‌ను ఆవిష్కరించి వివరాలు తెలిపారు. సాంస్కృతిక వైభవం పెంపొందించాలనే లక్ష్యంతో నన్నయ విశ్వవిద్యాలయం ఆర్ట్స్-కామర్స్ ఆంగ్ల విభాగం, సెంటర్ ఫర్ ఆంధ్రప్రదేశ్ స్టడీస్ (విజయవాడ) సంయుక్త ఆధ్వర్యంలో ఈ సదస్సు నిర్వహిస్తున్నామన్నారు. కన్వీనర్లుగా ఆచార్య కె.శ్రీరమేష్, ఆచార్య డి.జ్యోతిర్మయి, ఎన్.సజనారాజ్ వ్యవహరిస్తున్నారన్నారు. ఈ సదస్సులో ప్రధానంగా మన రాష్ట్ర మౌలిక అస్తిత్వాన్ని ప్రభావితం చేసే అంశాలపై పత్ర సమర్పణలకు ఆహ్వానిస్తున్నామన్నారు. పూర్తి వివరాలను విశ్వవిద్యాలయం వెబ్‌సైట్‌లో పొందుపరిచామన్నారు. సూచించిన రుసుము చెల్లించి ఈ నెల 25వ తేదీలోపు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని, పరిశోధనా పత్రాలు సమర్పించాలని కోరారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్, కన్వీనర్లు ఆచార్య కె.శ్రీరమేష్, ఆచార్య డి.జ్యోతిర్మయి, సెంటర్ ఫర్ ఆంధ్రప్రదేశ్ స్టడీస్ (కాప్స్) అధ్యక్షుడు, ప్రముఖ మానసిక వైద్యుడు కర్రి రామారెడ్డి, ఓలేటి సత్యనారాయణ పాల్గొన్నారు.



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న ఉప కులపతి ఆచార్య శ్రీనివాసరావు

బీవీసీలో ఓటరు నమోదు కార్యక్రమం

అమలాపురం రూరల్, అక్టోబరు 8: భట్లపాలెం బీవీసీ ఇంజనీరింగ్ కళాశాలలో మంగళవారం స్వీప్ కార్యక్రమం ప్రిన్సిపాల్ డాక్టర్ జేవీజీ రామారావు అధ్యక్షతన నిర్వహించారు. ఓటరు నమోదులో భాగంగా చేపట్టిన స్వీప్ కార్యక్రమానికి అమలాపురం ఆర్డీవో మాధవి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. 18ఏళ్లు నిండిన విద్యార్థులంతా ఓటర్లుగా పేర్లను నమోదు చేయించుకోవాలని ఆర్డీవో సూచించారు. వైస్‌ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంఎస్ఎస్ మదన్, పరిపాలనాధికారి జవ్వాది వెంకటకృష్ణారావు, రెవెన్యూఅధికారులు పాల్గొన్నారు.

16 రకాల నిత్యావసరాలు అందించాలి

అంతర్వేది, అక్టోబరు 8: కేరళ ప్రభుత్వ పదహారు రకాల నిత్యావసర సరుకులను చౌక డిపోల ద్వారా తక్కువ ధరకే సరఫరా చేస్తుందని, ఈవిధంగా చేయడం ద్వారా పేదలు, మధ్యతరగతి ప్రజలకు కొంత ఆర్థిక వెసులుబాటు కలుగుతుందని సీపీఐ నాయకులు ప్రభుత్వాన్ని డిమాండు చేశారు. సఖినేటిపల్లిలో జరిగిన సీపీఐ గ్రామశాఖ సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి కామ్రేడ్ కె.సత్తిబాబు, సీపీఐ రాజోలు నియోజకవర్గ కార్యదర్శి దేవ రాజేంద్రప్రసాద్ మాట్లాడారు. కార్యక్రమంలో గెడ్డం ప్రభాకరరావు, చింతా ప్రసాదరావు, గొల్లమందల వసంతరావు, జిల్లెల్ల కృష్ణ, నల్లి పద్మావతి పాల్గొన్నారు. అనంతరం సఖినేటిపల్లి సీపీఐ గ్రామ కార్యదర్శిగా కలిగితి జాన్‌బాబు, సహాయ కార్యదర్శిగా కుసుమ రమేష్, ఐదుగురు కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు.

వేగుళ్లను కలిసిన ఆర్యవైశ్య పాలకవర్గం

మండపేట, అక్టోబరు8: మండపేటలో నూతనంగా ఎన్నికైన ఆర్యవైశ్య కార్యవర్గ సభ్యులు మంగళవారం ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావును స్థానిక పార్టీ కార్యాలయంలో కలిశారు. సంఘ అధ్యక్షుడు సంకా శ్రీనివాసరంగా, గౌరవాధ్యక్షుడు కాళ్లకూరి గొల్లబాబు, కన్యకాపరమేశ్వరి ఆలయ చైర్మన్ బోనగిరి సుబ్బారావు, కమిటీ సభ్యులు, టీడీపీ నేతలు కాళ్లకూరి శ్రీనివాస్, కేశారపు శ్రీను, గ్రంధి సత్తి రాజు తదితరులు ఎమ్మెల్యే వేగుళ్లను కలిసారు. ఈసందర్భంగా వారిని ఎమ్మెల్యే అభినందించారు.

రూ.2.02లక్షలు విరాళం

ఆత్రేయపురం, అక్టోబరు 8: కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో నిర్మిస్తున్న వకుళమాత అన్నదాన భవన నిర్మాణానికి భీమవరానికి చెందిన వేండ్ర రమేష్‌కుమార్ రూ.2,02,232 విరాళం సమర్పించారు. ఉపకమిషనరు, ఈవో నల్లం చక్రధరరావు దాతలకు స్వామివారి చిత్రపటం అందజేశారు.

స్థానిక సమస్యలను గుర్తించి పరిష్కరించాలి

అమలాపురం రూరల్, అక్టోబరు 8: స్థానికంగా ఉన్న ప్రజా ప్రతినిధులు సమస్యలను ఎప్పటికప్పుడు గుర్తిస్తూ వాటి పరిష్కారానికి కృషి చేయాల్సి ఉంటుందని డీఎల్‌పీవో పి.బొజ్జిరాజు సూచించారు. అమలాపురం మండల పరిషత్ కార్యాలయంలో రెండు రోజుల శిక్షణ అనంతరం ముగింపు సభ మంగళవారం నిర్వహించారు. ఎంపీపీ కుడుపూడి భాగ్యలక్ష్మి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో వివిధ గ్రామాల వార్డు సభ్యులు, కార్యదర్శులు, ఉపసర్పంచ్‌లకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. వార్డు సభ్యులకు ఉన్న హక్కులు, విధుల గురించి వివరించారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఉండ్రు బాబ్జిరాజు, ఈవోపీఆర్డీ బి.మంగాదేవి, పంచాయతీ కార్యదర్శుల సంఘం జిల్లాశాఖ అధ్యక్షుడు రుద్రరాజు ఎస్ఎస్ సూరపరాజు, కార్యదర్శులు పాల్గొన్నారు.

చినగాడవిల్లిలో అగ్నిప్రమాదం

ఉప్పలగుప్తం, అక్టోబరు8: చినగాడవిల్లిలో సోమవారం అర్ధరాత్రి జరిగిన అగ్ని ప్రమాదంలో దూనబోయిన ప్రభాకరరావు తాటాకిల్లు దగ్ధమైంది. రూ.6లక్షల ఆస్తి నష్టం జరిగినట్టు రెవెన్యూ అధికారులు తెలిపారు. విద్యుదాఘాతం వల్ల ప్రమాదం జరిగిందని భావిస్తున్నారు. ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు మంగళవారం బాధితులను పరామర్శించి, ప్రభుత్వ సహాయం అందించారు. గృహ నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తామన్నారు. ఎంపీటీసీ నిమ్మకాయల రాము, తహసీల్దార్ వీఎస్ దివాకర్, టీడీపీ బీసీ సెల్ మండల అధ్యక్షుడు గుత్తుల శ్రీనివాసరావు, నియోజకవర్గ అధ్యక్షుడు గుత్తుల నాగేశ్వరరావు, యర్రా కృష్ణార్జునరావు, ఆర్ఐ రమణ, వీఆర్వో నాగులపల్లి పళ్లంరాజుపాల్గొన్నారు.

బాధ్యతగా పనిచేస్తే చిరకాల గుర్తింపు

అల్లవరం, అక్టోబరు8: విధినిర్వహణలో బాధ్యతగా పనిచేసే ఉద్యోగులకు చిరకాల గుర్తింపు లభిస్తుందని ఎంపీపీ యిళ్ల శేషగిరిరావు అన్నారు. తూర్పులంక పంచాయతీ కార్యదర్శిగా పనిచేసి మాచవరం బదిలీపై వెళ్లిన సత్యనారాయణను సన్మానించారు.

నేతల ఫొటోలతో ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలి

రాయవరం, అక్టోబరు 8: మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి పనులు గుర్తించేందుకు నిర్వహిస్తున్న గ్రామసభల వద్ద ప్రధాని మోదీ,సీఎం చంద్రబాబు, డిప్యూటీసీఎం పవన్‌కల్యాణ్ ఫొటోలతో ఫ్లెక్సీ ఏర్పాటుకు అధికారులు చర్యలు తీసుకోవాలని చెల్లూరుకు చెందిన టీడీపీ, జనసేన నేతలు డిమాండ్ చేశారు. మంగళవారం గ్రామంలో నిర్వహించిన గ్రామసభలో నేతలు మాట్లాడారు.

శ్రీమహాలక్ష్మీదేవిగా కనకదుర్గమ్మ దర్శనం



అమలాపురం శ్రీదేవిమార్కెట్, హౌసింగ్‌బోర్డుకాలనీలలో శ్రీమహాలక్ష్మీదేవిగా, ద్రాక్షారామ: మాణిక్యాంబ, రాయవరం: వెదురుపాక దుర్గమ్మ., మండపేట: ద్వారపూడిలో వాసవీమాత, మామిడికుదురు: పాశర్లపూడి కొట్టుమెరకలో అమ్మవారు

అమలాపురం టౌన్, అక్టోబరు 8: దేవి శరన్నవరాత్రుల్లో భాగంగా ఆరో రోజు మంగళవారం పలు ఆలయాల్లో అమ్మవారు భక్తులకు శ్రీమహాలక్ష్మి దేవిగా దర్శనమిచ్చారు. అమలాపురం శ్రీదేవిమార్కెట్ సెంటర్‌లోని శ్రీదేవి అమ్మవారిని డాక్టర్ జీవీఎస్ఎన్ రాజా-సింధూరి దంపతుల ఆధ్వర్యంలో శ్రీమహాలక్ష్మిదేవిగా విశేష అలంకారం జరిపించారు. కుప్పాల శ్రీను, రామకృష్ణ, బుజ్జిల ఆధ్వర్యంలో అఖండ అన్నసమారాధన నిర్వహించారు. స్థానిక మహిపాలవీధిలోని వేంకటేశ్వరస్వామి దేవస్థానం ప్రాంగణంలో వేంచేసి ఉన్న శ్రీవైష్ణవి కనకదుర్గమ్మను పెద్దింటి సత్యవెంకటఅనంతకృష్ణసాయి దీక్షితులు శ్రీమహాలక్ష్మిదేవిగా విశేష అలంకారం చేశారు. ఆలయ ఈవో దూనబోయిన సాయిబాబు ఆధ్వర్యంలో భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా ఏర్పాట్లు చేశారు. కొల్వకొలను వీధిలోని శ్రీవేపచెట్టు కనకదుర్గమ్మను రవణం సత్యమూర్తి, పిండి గణేష్‌దుర్గలక్ష్మిలోవేశ్వరరావు, పిండి మణికంఠ, గారపాటి ఓంప్రకాష్ దంపతుల ఆధ్వర్యంలో శ్రీమహాలక్ష్మి దేవిగా విశేష అలంకారం చేశారు. హౌసింగ్ బోర్డు కాలనీలోని కల్యాణదుర్గమ్మను రుద్రరాజు సురేష్‌కుమార్‌రాజు, సుష్మ దంపతుల ఆధ్వర్యంలో శ్రీమహాలక్ష్మి దేవిగా అలంకారం చేశారు. గోల్డ్‌మార్కెట్ సెంటర్‌లోని శ్రీకామాక్షి అమ్మవారిని శ్రీమహాలక్ష్మి దేవిగా అలంకరించగా వందలాది మంది మహిళలు బారులుతీరి కుంకుమ పూజల్లో పాల్గొన్నారు. బండారులంక శివారు చినచంద్రపురంలో వేంచేసి ఉన్న శ్రీకనకదుర్గమ్మ ఆలయంలో కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ చింతా శంకరమూర్తి, సర్పంచ్ పెనుమాల సునీత, నాయకులు పిచ్చిక శ్యామ్, ఆశపు రామలింగేశ్వరరావు, బట్టు పండు, కాశిన బాబీ, దంగేటి శ్రీరామ్ తదితరులు పాల్గొన్నారు.

శరన్నవరాత్రి వేడుకలు

ఆత్రేయపురం, అక్టోబరు 8: అమ్మవార్ల ఆలయాల్లో మంగళవారం మహిళలు భక్తిశ్రద్ధలతో కుంకుమ పూజలు నిర్వహించారు. ర్యాలి గాయత్రీదేవిని శాకంబరిగా అలంకరించారు. ఉచ్చిలి విజయదుర్గదేవిని మహాలక్ష్మీదేవిగా అలంకరించి భక్తులకు దర్శనమిచ్చారు. వివిధ గ్రామాల్లో భవాని దీక్షధారులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

మహాలక్ష్మిగా మాణిక్యాంబ అమ్మవారు

ద్రాక్షారామ, అక్టోబరు 8: ద్వాదశశక్తి పీఠం ద్రాక్షారామ మాణిక్యాంబ అమ్మవారు మంగళవారం మహాలక్ష్మీగా భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారి సన్నిధిలో విశేష కుంకుమార్చనలు జరిగాయి. మధ్యాహ్నం శ్రీచక్రనవావర్ణార్చన జరిగింది. సాయంత్రం అమ్మవారికి లక్ష కుంకుమార్చన, సువర్ణ, రజిత పుష్పార్చన నిర్వహించారు. ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు, పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప భీమేశ్వరుని, మాణిక్యాంబను దర్శించుకున్నారు.

మహాలక్ష్మి అలంకరణలో..

ముమ్మిడివరం, అక్టోబరు 8: ఠాణేలంక పంచాయతీ పరిధిలోని గోదశివారిపాలెంలోని శ్రీవిజయదుర్గమ్మ మంగళవారం మహాలక్ష్మి అమ్మవారిగా భక్తులకు దర్శనమిచ్చారు. రూ.25లక్షల కరెన్సీ నోట్లతో అమ్మవారిని విశేషంగా అలంకరించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని విశేష పూజలు జరిపించారు. చినకొత్తలంకలోని శ్రీవిజయదుర్గమ్మ చండీదేవిగా భక్తులకు దర్శమిచ్చారు. అమ్మవారిని రూ.50వేల కరెన్సీ నోట్లతో విశేషంగా అలంకరించారు. ఈసందర్భంగా అమ్మవారికి విశేష పూజలు జరిపించారు. ముమ్మిడివరం నగర పంచాయతీ పెద్దవంతెన సమీపంలోని విళ్ల ఈశ్వరమ్మ ఆలయంలోని విజయదుర్గమ్మవారు మహాలక్ష్మి అమ్మవారిగా భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారిని కరెన్సీ నోట్లతో అలంకరించారు. విళ్ల ఈశ్వరరావు, గణేష్ సోదరుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు జరిపించారు. అలాగే పళ్లవారిపాలెంలోని విజయదుర్గమ్మవారిని రూ.5లక్షల కరెన్సీ నోట్లతో విశేషంగా అలంకరించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

ఆలయాల్లో ప్రత్యేక పూజలు

రావులపాలెం, అక్టోబరు 8: దేవీశరన్నవరాత్రి వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈతకోట, రావులపాలెంలో ఉన్న శ్రీకనకదుర్గమ్మ అమ్మవారి ఆలయాల్లో ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన మండపాల వద్ద అమ్మవారికి ఉదయం, సాయంత్రం ప్రత్యేక పూజలు నిర్వహించారు. భవానీ మాలధారణ చేసిన భక్తులు మండపాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

విజయదుర్గమ్మకు హోమాలు

అల్లవరం, అక్టోబరు 8: విజయదుర్గమ్మ అమ్మవారి ఆలయంలో మంగళపల్లి పాండురంగవిఠల్ ఆధ్వర్యంలో వేద పండితులు లక్ష్మీగణపతి, రుద్ర, చండీ మృత్యుంజయ హోమాలు నిర్వహించారు. యెంట్రుకోన, డిరావులపాలెం, బెండమూర్లంక గోడితిప్ప, గోడి, మొగళ్లమూరు, దేవగుప్తం గ్రామాల్లో దుర్గాదేవికి కుంకుమ పూజలు నిర్వహించారు. ఆలయాల వద్ద అన్నసమారాధనలు నిర్వహించారు.

వివిధ అలంకరణల్లో అమ్మవార్లు

యానాం, అక్టోబరు 8: యానాం శివారు గిరియంపేట రోడ్డులోని పాలకనకదుర్గమ్మ ఆలయంలోఅమ్మవారు మహాలక్ష్మీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ అర్చకులు కామేశ్వరశర్మ నేతృత్వంలో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా గోపూజ, కత్యాయినీ పూజలు నిర్వహించారు. యానాం త్యాగరాజ వీధిలోని లలితాదేవి ఆలయంలో, గోపాల్‌నగర్‌లోని శారదా దేవి ఆలయంలో అమ్మవార్లు లక్ష్మీదేవిగా దర్శనమిచ్చారు.

విజయదుర్గ ఆలయంలో మంత్రి పూజలు

కాట్రేనికోన, అక్టోబరు 8: చింతలమెరక విజయదుర్గ ఆలయంలో మంగళవారం కార్మిక మంత్రి వాసంశెట్టి సుభాష్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో గుత్తుల సాయి, వెంట్రు సుధీర్, విత్తనాల వెంకటరమణ, కముజు లక్ష్మీరమణారావు, వాసంశెట్టి సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

సరస్వతీ దేవి అలంకరణలో వాసవీమాత

అంబాజీపేట, అక్టోబరు 8: అంబాజీపేట బస్‌స్టాండ్ వద్ద ఉన్న శ్రీవాసవి కన్యకాపరమేశ్వరీ అమ్మవార్ని మంగళవారం సరస్వతిదేవిగా అలంకరించారు. అనంతరం అమ్మవార్కి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, కుంకుమ పూజలు నిర్వహించారు. ఆలయంలో విద్యార్థులు సరస్వతి పూజ నిర్వహించారు. అంబాజీపేట సంతమార్కెట్‌లో ఉన్న శ్రీవిజయకనకదుర్గమ్మ ఆలయంలో అమ్మవార్కి అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంబాజీపేట విజయభేతాళస్వామి, పక్షులరావిచెట్టు వద్ద అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామాల్లో ఏర్పాటుచేసిన అమ్మవారి పందిళ్లల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మాచవరం ఇటికాలమ్మ, మహాలక్ష్మీమ్మ అమ్మవార్ల ఆలయంలో మహిళలు కుంకుమ పూజలు నిర్వహించారు.

శ్రీమహాలక్ష్మీదేవిగా శ్రీకనకదుర్గమ్మ

పి.గన్నవరం, అక్టోబరు 8: పి.గన్నవరం శివారు తాటికాయలవారిపాలెంలో మంగళవారం శ్రీమహాలక్ష్మీదేవిగా శ్రీకనకదుర్గమ్మ దర్శనమిచ్చారు. ప్రధానఅర్చకులు పుల్లేటికుర్తి ఫణి అమ్మవారికి పూజలు, అభిషేకాలు, కుంకుమపూజలు నిర్వహించారు. మండలంలోని వివిధ గ్రామాల్లో ఉన్న శ్రీకనకదుర్గ ఆలయాల్లో కుంకుమ పూజలు నిర్వహించారు.

మహాలక్ష్మిగా పూజలందుకున్న విజయదుర్గ

రాయవరం, అక్టోబరు 8: వెదురుపాక విజయదుర్గా అమ్మవారు శ్రీమహాలక్ష్మి అమ్మవారిగా పూజలందుకుంది. మహాలక్ష్మి అవతారం సందర్భంగా అమ్మవార్ని వివిధ రకాల ఆభరణాలు, పూలదండలు, కరెన్సీ దండలతో ప్రత్యేకంగా అలంకరించి లక్ష్మీ అష్టోత్తర, సహస్రనామాలతో కుంకుపూజలు చేశారు. పీఠంలో మహిళలు సామూహిక శ్రీచక్ర అర్చనలు నిర్వహించారు. ఈసందర్భంగా పీఠాధిపతి గాడ్ భక్తులనుద్దేశించి మహాలక్ష్మి అమ్మవారి అవతారం విశిష్టతను, అమ్మవార్ని పూజిస్తే కలిగే శుభాలను వివరించారు. కార్యక్రమంలో పీఠం అడ్మినిస్ట్రేటర్ వీవీ బాపిరాజు, విజయదుర్గ సేవాసమితి ప్రతినిధులు గాదే భాస్కరనారాయణ, సత్య వెంకట కామేశ్వరి, బలిజేపల్లి రమ, పెదపాటి సత్యకనకదుర్గ, పీఠం పీఆర్వో బాబీ, అన్నవరం పాలకమండలి మాజీ సభ్యుడు కందర్ప హనుమాన్ పాల్గొన్నారు.

ఆలయాల వద్ద భజనా కాలక్షేపాలు

అంతర్వేది, అక్టోబరు 8: సఖినేటిపల్లి మండలంలో అమ్మవారి ఆలయాల వద్ద కుంకుమ పూజలు నిర్వహించారు. ఆలయాల వద్ద భజనా కాలక్షేపాలు నిర్వహించారు. అంతర్వేది గంగయ్యవారధి వద్ద ఉన్న శ్రీకనకదుర్గమ్మ ఆలయం వద్ద ప్రత్యేక పూజలు చేశారు. అంతర్వేది సైకిల్‌షాపు సెంటర్, కేశవదాసుపాలెం, మోరి, మోరిపోడు, టేకిశెట్టిపాలెం, సఖినేటిపల్లి, లంక, రామేశ్వరం తదితర గ్రామాల్లో అమ్మవారు మహాచండీ అవతారంలో దర్శనమిచ్చారు.

కరెన్సీ నోట్లతో కనకదుర్గమ్మ అలంకరణ

మామిడికుదురు, అక్టోబరు 8: పాశర్లపూడిలో కొట్టుమెరకలో కనకదుర్గమ్మవారిని భక్తులు మంగళవారం రూ.2.50లక్షల కరెన్సీ నోట్లతో సుందరంగా అలంకరించారు. నోట్లను దండలుగా వేలాడదీసి అమ్మవారి చుట్టూ పెట్టడంతో కరెన్సీ శోభ సంతరించుకుంది. పెదపట్నంలంక కనకదుర్గమ్మవారు కాత్యాయణి అవతారంలో దర్శనమిచ్చారు. ఈదరాడలో నిర్వహించిన కుంకుమ పూజల్లో ముత్తయిదువులు పాల్గొని పూజలు నిర్వహించారు. మంగళవారం కనకదుర్గమ్మ ఆలయాల వద్ద ప్రత్యేక కుంకుమ పూజలు నిర్వహించారు. మామిడికుదురులోని విజయదుర్గమ్మ ఆలయం వద్ద విద్యార్థులు సరస్వతీ పూజ నిర్వహించారు. విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు అందించారు. ఈసందర్భంగా నిర్వహించిన కోలాట ప్రదర్శన ఆకట్టుకుంది.

ఎన్డీయే ప్రభుత్వం ఆదుకుంటుంది

మలికిపురం, అక్టోబరు 8: ఎన్డీఏ ప్రభుత్వం అన్నివర్గాల సంక్షేమం కోసం పాటుపడుతుందని ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ అన్నారు. ఇటీవల వరదల సమయంలో పంట కాల్వలో కాలుజారి సఖినేటిపల్లికి చెందిన చీర్ల దుర్గారావు(38) మృతిచెందాడు. ప్రభుత్వం నుంచి మంజూరైన రూ.5లక్షలు చెక్కును అతని భార్య, కుటుంబ సభ్యులకు అందించారు. టీడీపీ, జనసేన మండల అధ్యక్షులు ముప్పర్తి నాని, గుబ్బల ఫణి, మార్క్‌ఫెడ్ డైరెక్టర్ గుండుబోగుల పెద్దకాపు, అయినవిల్లి సత్యనారాయణ, నామన నాగభూషణం, ఆకుల చినవెంకన్నాయుడు పాల్గొన్నారు.

మాలధారణలతో పుణ్య ఫలం

అంబాజీపేట, అక్టోబరు 8: మాలధారణలతో భక్తిభావం పెరగడంతో పాటు పుణ్యఫలం లభిస్తుందని కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. మాచవరం సచివాలయం సమీపంలో అంబాజీపేట భవాని సమితి ఆధ్వర్యంలో కాశీవిశ్వనాధశర్మ స్థలంలో ఏర్పాటుచేసిన భవానీల భిక్ష కార్యక్రమంలో మంత్రి సుభాష్ పాల్గొన్నారు. భవానీలతో భిక్ష స్వీకరించారు. అంబాజీపేట పశువుల సంతమార్కెట్‌లో ఉన్న విజయదుర్గమ్మ అమ్మవార్ని మంత్రి సుభాష్ దర్శించుకున్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో మంత్రిని సత్కరించారు. ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, నాయకులు గణపతి వీరరాఘవులు, శిరిగినీడి వెంకటేశ్వరరావు, బొంతు పెదబాబు, కొర్లపాటి గోపి, అరిగెల బలరామమూర్తి, నాగాబత్తుల వెంకటసుబ్బారావు, విత్తనాల శేఖర్, దొమ్మేటి సత్యమోహన్ పాల్గొన్నారు.

అధికారులతో ఎమ్మెల్యే బండారు సమీక్ష

రావులపాలెం, అక్టోబరు 8: రావులపాలెం టీడీపీ క్యాంపు కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో ఎమ్మెల్యే బండారు సత్యానందరావు సమీక్ష నిర్వహించారు. ఆర్అండ్‌బీ, ఆర్‌డబ్ల్యూఎస్ శాఖ అధికారులతో నిర్వహించిన సమీక్షలో నియోజకవర్గానికి సంబంధించిన రోడ్లు, తాగునీరుపై చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై చర్చించారు. ఈసందర్భంగా అధికారులు ఆ శాఖల వారీగా నియోజకవర్గ స్థితిగతులపై వివరించారు. టీడీపీ యువ నాయకులు బండారు సంజీవ్ పాల్గొన్నారు.

ఈకేవైసీ చేయించుకోవాలి

కొత్తపేట, అక్టోబరు8: రైతులు ఈ-పంట ఈకేవైసీ నమోదు తప్పనిసరిగా చేయించుకోవాలని ఏవో పిప ద్మలత చెప్పారు. కొత్తపేట, మోడేకుర్రుగ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈసందర్భంగా జరిగిన కార్యక్రమానికి ఏవో పద్మలత అధ్యక్షత వహించగా సర్పంచ్ బూసి జయలక్ష్మి భాస్కరరావు పాల్గొన్నారు. ఏవో పద్మలత మాట్లాడుతూ ఇన్సూరెన్స్, ఇన్‌పుట్ సబ్సిడీ, క్రాప్‌లోన్స్ లబ్ధి చేకూరేలా చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. అనంతరం మోడేకుర్రులో రైతులతో కలిసి వరి పొలాలను పరిశీలించి ప్రత్యక్షంగా చేపట్టాల్సిన చర్యలు గురించి వివరించారు.

లడ్డూ అపవిత్రతకు క్షమార్పణగా పంచనదీ జలాలతో శుద్ధి

ముమ్మిడివరం, అక్టోబరు 8: తిరుమల లడ్డూ అపవిత్రతకు క్షమార్పణగా సీహెచ్ గున్నేపల్లిలో శ్రీసీతాసమేత కల్యాణరామస్వామి ఆలయంలో శ్రీకల్యాణ వేంకటేశ్వరస్వామికి మంగళవారం పంచనదీ జలాలతో అభిషేకం, ప్రత్యేక పూజ, గోవిందనామాలు, ఓంనమో వెంకటేశాయ నామ జపం వంటి కార్యక్రమాలు నిర్వహించారు. శ్రీసీతా సమేత కల్యాణ రారామస్వామి ఆలయ ట్రస్టు, సమరసతా సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో రాజకీయ పార్టీలకు అతీతంగా ఈకార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామస్తులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి


రావులపాలెం, అక్టోబరు8: రావులపాలెం ప్రభుత్వ కళాశాల ఎదురుగా జాతీయరహదారిపైజరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతిచెందాడు. రావులపాలేనికి చెందిన పెన్మత్స శివరామరాజు(60) స్థానికంగా ఓ దాబాలో సప్లయర్‌గా పనిచేస్తున్నాడు. మంగళవారం తెల్లవారుజామున దాబా వద్ద నుంచి టీ తాగేందుకు సెంటర్‌కు వచ్చి తిరిగి వెళ్తుండగా తణుకు వైపు నుంచి రాజమహేంద్రవరం వైపు వెళ్తున్న లారీ ఢీకొంది. అతడు అక్కడికక్కడే మృతిచెందాడు. కేసుదర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐతెలిపారు.

సమస్యల నుంచి విముక్తులను చేయడానికే ప్రజాదర్బార్



అమలాపురం రూరల్, అక్టోబరు 8: జగన్ ప్రభుత్వ వైఫల్యాలతో ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులు, సమస్యల నుంచి వారిని విముక్తులను చేయడానికే ప్రజాదర్బార్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు చెప్పారు. ప్రజా సమస్యల పరిష్కారానికి ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాల మేరకు మంగళవారం అమలాపురం మండల పరిషత్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక ప్రజాదర్బార్‌ను నిర్వహించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే ఆనందరావు మాట్లాడుతూ స్థానికంగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రజాదర్బారులో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వారి నుంచి 96 అర్జీలను ఎమ్మెల్యే స్వీకరించారు. ప్రధానంగా రోడ్లు, డ్రైన్లతో పాటు అనేక సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబు, రాష్ట్ర కార్యదర్శి పెచ్చెట్టి చంద్రమౌళి, ఎంపీపీ కుడుపూడి భాగ్యలక్ష్మి, జడ్పీటీసీ పందిరి శ్రీహరి, డీఎల్‌పీవో పి.బొజ్జిరాజు, ఎంపీడీవో ఉండ్రు బాబ్జిరాజు, ఈవోపీఆర్డీ బి.మంగాదేవి, నాయకులు మంథా ఫణికుమార్, పొలమూరి ధర్మపాల్, మట్టా మహాలక్ష్మిప్రభాకర్, నడింపల్లి ఉదయబాబు, లింగోలు పండు, కొప్పుల నాగమానస, పెనుమాల సునీత, మోటూరి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

వైభవంగా వెంకన్న కల్యాణం



యానాం, అక్టోబరు 8: యానాం శ్రీభూసమేత వేంకటేశ్వరుని కల్యాణోత్సవం మంగళవారం ఘనంగా జరిగింది. కరకుదురుకు చెందిన ఆగమ పండితులు వాడపల్లి గోపాలాచార్యులు పర్యవేక్షణలో శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో కల్యాణ వేడుకను నిర్వహించారు. వెంకటేశ్వరస్వామి బాలలయంలో శాస్త్రోతంగా జరిగిన కల్యాణోత్సవంలో పరిపాలనాధికారి మునిస్వామి, పుదుచ్చేరి నుంచి వచ్చిన ట్రైనీ ఐఏఎస్ అకింత్ కుమార్, ఆలయ కార్యనిర్వహణధికారి ఖండవల్లి రామకృష్ణలు స్వామివారికి పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలను సమర్పించారు.

సినిమా గైడ్

అమలాపురం

వెంకటరమణ	: శ్వాగ్
శ్రీలలిత	: సెలబ్రిటి
శేఖర్ స్క్రీన్-1	: రామనగర్ బన్నీ
శేఖర్ స్క్రీన్-2	: దక్షిణ
రమా	: దేవర-1
గణపతి	: మత్తువదలరా-2
వెంకటపద్మావతిస్క్రీన్-1	: దేవర-1
వెంకటపద్మావతి స్క్రీన్-2	: సత్యంసుందరం

ఎంపీడీవోగా వెంకటాచార్యులు



ముమ్మిడివరం, అక్టోబరు8: ముమ్మిడివరం ఎంపీడీవోగా తాడి వెంకటాచార్యులు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. అయినవిల్లి నుంచి బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇక్కడ పనిచేసిన జె.రాంబాబు కాజులూరు బదిలీపై వెళ్లారు. ఎంపీడీవోకు ఎంపీపీ కోలా గంగాభవానీ, ఈవోపీఆర్డీ సీహెచ్ కల్యాణి, ఏఎస్ శ్రీనివాస్ సిబ్బంది స్వాగతం పలికారు.

ఈవోపీఆర్డీగా మల్లికార్జునరావు

మలికిపురం, అక్టోబరు 8: మలికిపురం ఈవోపీఆర్డీగా జి.మల్లికార్జునరావు బాధ్యతలు స్వీకరించారు.అమలాపురం నుంచి ఇక్కడకు బదిలీపై వచ్చారు. ఇక్కడ పనిచేసిన బి.మంగాదేవి అమలాపురం బదిలీ అయ్యారు.

కార్యదర్శిగా సత్యనారాయణ



కాట్రేనికోన, అక్టోబరు 8: కాట్రేనికోన పంచాయతీ కార్యదర్శిగా జేవీవీ సత్యనారాయణ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన గతంలో ఇదే పంచాయతీలో కార్యదర్శిగా పనిచేశారు. మండలంలోని వివిధ పంచాయతీల్లో పనిచేసిన అనుభవం ఉంది.

దేవస్థానం అభివృద్ధి కమిటీ చైర్మన్‌గా అబ్బాయివెంకన్న



అమలాపురం టౌన్, అక్టోబరు 8: అమలాపురం శ్రీవేంకటేశ్వరస్వామి దేవస్థానం అభివృద్ధి కమిటీ చైర్మన్‌గా మాజీ కౌన్సిలర్ జంగా అబ్బాయివెంకన్న మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. గత పాలకవర్గం రాజీనామా చేయడంతో దేవస్థానం అభివృద్ధి పూర్తిగా కుంటుపడడంతో అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్‌గా అబ్బాయివెంకన్నను నియమించారు. టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబుకు అనుంగ శిష్యుడైన అబ్బాయివెంకన్నను అభివృద్ధి కమిటీ చైర్మన్‌గా నియమించడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఆయనను వేదపండితులు ఆశీర్వదించారు. ఆలయ ఈవో దూనబోయిన సాయిబాబు పాల్గొన్నారు. అనంతరం దేవస్థానం ఉద్యోగులతో అబ్బాయివెంకన్న సమావేశం నిర్వహించి ఆలయ అభివృద్ధిపై చర్చించారు. అయితే ప్రభుత్వ పరంగా ఆదేశాలు రాకుండా అభివృద్ధి కమిటీ చైర్మన్‌గా నియమించడం ఏమిటని పలువురు వైసీపీ నాయకులు విమర్శిస్తున్నారు.

ఎల్ఐసీ యాజమాన్య నిర్లక్ష్య వైఖరికి నిరసన

అమలాపురంటౌన్, అక్టోబరు8: పేద వర్గాలను, వృద్ధులను పట్టించుకోకుండా లైఫ్ ఇన్సూరెన్సు కార్పొరేషన్ ఆఫ్ ఇండియా యాజమాన్యం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న తీరును నిరసిస్తూ రెండో రోజు మంగళవారం అమలాపురం ఎల్ఐసీ కార్యాలయం వద్ద ఏజెంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. కొత్త నిర్ణయాలను ఉపసంహరించుకోవాలని నినాదాలతో హోరెత్తించారు. అసోసియేషన్ అధ్యక్షుడు సుందరనీడి శ్రీనివాసరావు, కార్యదర్శి ఎన్.శ్యామ్‌బాబు, కోశాధికారి కొల్లు జ్ఞానేశ్వర్, రాజమహేంద్రవరం డివిజన్ అధ్యక్షుడు పోలిశెట్టి బ్రహ్మయ్య, రావూరి ఉదయభాస్కర్, విత్తనాల రామారావు, కంచర్ల సుబ్రహ్మణ్యేశ్వరరావు, దొమ్మేటి శివస్వామి, సాపే వెంకటేశ్వర్లు, సూరవరపు త్రిమూర్తులు పాల్గొన్నారు.

శతాధిక వృద్ధుడి మృతి



అయినవిల్లి, అక్టోబరు 8:ఎస్.మూలపొలానికి గ్రామానికి చెందిన శతాధిక వృద్ధుడు మేకా సత్యనారాయణ (అబ్బులు)(102) మంగళవారం మృతిచెందినట్టు గ్రామస్తులు తెలిపారు. ఆయనకు ముగ్గురు కుమారులు, ఇద్దరు కుమార్తెలు, పదిమంది మనుమలు ఉన్నారు.

మంత్రి సుభాష్ పటిక బెల్లంతో తులాభారం



కె.గంగవరం, అక్టోబరు8: సుందరపల్లిలో మంగళవారం మన గ్రామం - మన సుభాష్ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మంత్రి వాసంశెట్టి సుభాష్ పాల్గొన్నారు. కూటమి ఎన్నికల్లో విజయం సాధిస్తే తులా భారం వేస్తామని నాయకులు మొక్కుకున్నారు. దుర్గాదేవి ఆలయంలో మంత్రి సుభాష్ పటిక బెల్లంతో తులాభారం వేసి మొక్కు చెల్లించుకున్నారు. జనసేన పార్టీ ఇన్‌చార్జి పోలిశెట్టి చంద్ర శేఖర్, ఎంపీటీసీ తాడాల జానకిరామ్, కూటమి నాయకులు శీరెడ్డి సత్తిబాబు పాల్గొన్నారు.

పొలం పిలుస్తోంది

కాట్రేనికోన, అక్టోబరు 8: కాట్రేనికోనలో మంగళవారం పొలం పిలుస్తోంది నిర్వహించారు. కార్యక్రమంలో ఆత్మ పీడీ జ్యోతిర్మయి, జిల్లా రైతు శిక్షణాకేంద్రం ఏడీఏ రాజశేఖర్, ఏవో మనోహర్ పాల్గొని సస్యరక్షణ, ఎరువుల యాజమాన్యంపై రైతులకు అవగాహన కల్పించారు. సుడిదోమ, ఎండుతెగులుపై అవగాహన కల్పించారు. రైతులకు ఇష్టమైన మిల్లులకే ధాన్యం పంపించుకోవచ్చని వ్యవసాయాధికారి తెలిపారు.

వచన కవితల పోటీలు

అంబాజీపేట, అక్టోబరు 8: అరిగెల బలరామమూర్తి సాహితీ కళావేదిక ఆధ్వర్యంలో ద్వితీయ వార్షికోత్సవం నవంబరులో నిర్వహిస్తారు. పర్యావరణ పరిరక్షణ, పర్యావరణ సమతుల్యత అనే అంశంపై 25పంక్తుల్లో వచన కవిత రాసి ఈనెలఖారుకు ఆర్టీసీ కాంప్లెక్స్ ఎదురుగా ఉన్న షాపులో అందజేయాలన్నారు. ఎంపికైన కవితకు రూ.5వేలు, జ్ఞాపికను అందిస్తారు.

బీజేపీని బలోపేతం చేయాలి

ముమ్మిడివరం, అక్టోబరు 8: సభ్యత్వాల నమోదును వేగవంతంచేసి, మండలానికి కనీసం 10వేలు సభ్యత్వాలు పూర్తి చేయాలని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వేటుకూరి సూర్యనారాయణ రాజు సూచించారు. సీహెచ్ గున్నేపల్లిలో ముమ్మిడివరం, కాట్రేనికోన మండలాల బీజేపీ పార్టీ నాయకులు, కార్యకర్తల సమావేశం కొయ్యల దుర్గారావు అధ్యక్షతన మంగళవారం జరిగింది. సమావేశంలో వేటుకూరి మాట్లాడారు. పాలూరి సత్యానందం, గొలకోటి వెంకటరెడ్డి, గ్రంధి నానాజీ, మోకా వెంకటసుబ్బారావు, గనిశెట్టి బాబి, మట్టా సూరిబాబు, అల్లూరి సత్యనారాయణరాజు, బసవా శ్రీహరిబాబు, కోనే రామమూర్తిలతో పాటు పలువురు పాల్గొని కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అమలుచేస్తున్న ప్రజా సంక్షేమ అభివృద్ధి పథకాల గురించి వివరించారు.

వేటకు వెళ్లిన వ్యక్తి మృతి

ఆత్రేయపురం, అక్టోబరు8: మండలంలోని బొబ్బర్లంక జల్లివారిపేటకు చెందిన గోశాల వీర్రాజు(65) మంగళవారం ఉదయం బొబ్బర్లంక బ్యారేజీ దిగువన వల వేస్తుండగా ప్రమాదవశాత్తు జారి గల్లంతయ్యాడు. స్థానికులు నాటు పడవల ద్వారా గాలింపు చర్యలు చేపట్టి మృతదేహాన్ని వెలికితీశారు. అతడికి భార్య సుబ్బాయమ్మ, నలుగురు కుమార్తెలు ఉన్నారు. కుటుంబ సభ్యులు గోదావరి వద్దకు చేరుకుని రోదించారు. జల్లివారిపేటలో విషాదఛాయలు అలుముకున్నాయి.

సన్నవిల్లి- ఉప్పూడి రహదారి అధ్వానం

ఉప్పలగుప్తం, అక్టోబరు 8: సన్నవిల్లి- ఉప్పూడి టిర్రాజియం రహదారి ప్రస్తుతం ఇలా మారింది. సన్నవిల్లి నుంచి ఉప్పూడి వరకు ఆరు కిలోమీటర్ల రహదారిపై ప్రయాణం సాహసమే. నిత్యం రద్దీగా ఉండే ఈరహదారిపై ప్రయాణం వాహనచోదకులకు నిజంగా ఒక పరీక్షే. తెలుగుదేశం హయాంలో నిర్మించిన ఈ రహదారిని మళ్లీ వారే ఆధునీకీకరించాలని జనం కోరుతున్నారు.